సాక్షి
రంగారెడ్డి
గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



అమ్మానాన్న దూరమైనా..

తల్లిదండ్రులు దూరమై అనాథలుగా మారిన చిన్నారులను చిన్నాన్న భీమయ్య, చిన్నమ్మ యాదమ్మ అక్కున చేర్చుకున్నారు. 10లో▸



జీఓ ప్రకారం వేతనాలు..

జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ డిమాండ్ చేశారు. 10లో▸



ఇంట్లోకి చొరబడి..

వంట గదిలో ఉన్న వృద్ధురాలి మెడలో నుంచి దుండగులు పుస్తెలతాడును అపహరించారు. 10లో▸

అందరి చూపు.. రిజర్వేషన్ల వైపు

ఆశావహుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

- ముగిసిన రిజర్వేషన్ల ప్రక్రియ
- కలెక్టర్ చేతిలో జాబితా
- తొమ్మిది జెడ్పీటీసీ స్థానాలు బీసీలకు కేటాయింపు
- అదే రేషియోలో ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాలు
- జీఓ విడుదల చేసిన వెంటనే వెల్లడించే అవకాశం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు రోజులుగా జిల్లా యంత్రాంగం అంతా ఇదే పనిలో నిమగ్నమైంది. జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని కలెక్టర్, జెడ్పీ సీఈఓలు కలిసి జెడ్పీటీసీ స్థానాలకు ఆర్డీఓలు ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు, వార్డులకు ఎంపీడీఓలు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ జాబితాను గోప్యంగా ఉంచారు. సిద్ధం చేసిన రిజర్వేషన్ల తుది జాబితా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి చేరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం ధ్రువీకరించాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఇప్పటికే పోటీ చేయాలని భావించి గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేసుకున్న ఆశావహుల్లో ఈ రిజర్వేషన్ల అంశం మరింత ఉత్కంఠను రేపుతోంది. ఏ సీటు ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందో? తెలియక ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ రిజర్వేషన్లు మారితే.. ఆయా స్థానాల్లో ఎవరిని బరిలోకి దించాలనే చర్చ సైతం మొదలైంది.

జీఓ విడుదల చేయడమే ఆలస్యం

జిల్లాలో 27 మండలాలు, 15 మున్సిపాలిటీలు, మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, 526 గ్రామ పంచాయతీలు, 4,668 వార్డులు ఉన్నాయి. వీటిలో హయత్‌నగర్, సరూర్‌నగర్, బాలాపూర్, గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి మండలాలు జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వెళ్లిపోయాయి. 21 మండలాలు మాత్రమే రూరల్ ఏరియాలో మిగిలాయి. ఆయా మండలాల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించనున్నట్లు ప్రకటించింది. ఈ లెక్కన జిల్లాలో తొమ్మిది జెడ్పీటీసీ స్థానాలను బీసీలకు కేటాయించినట్లు తెలిసింది. ఎంపీపీ స్థానాలకు కూడా ఇదే రేషియోలో కేటాయించినట్లు సమాచారం. 97 ఎంపీటీసీ స్థానాలు, 221 పంచాయతీలు, 1,961 వార్డులను బీసీలకు కేటాయించినట్లు తెలిసింది. ప్రభుత్వం జీఓ విడుదల చేసిన తర్వాతే ఆయా రిజర్వేషన్ల స్థానాలను బయటికి వెల్లడించే అవకాశం ఉంది.

‘పరిషత్’.. తర్వాతే పంచాయతీ!

స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన గడువు చివరి దశకు చేరింది. ఈ ఎన్నికలపై కోర్టు మళ్లీ జోక్యం చేసుకోకుండా ఉండాలంటే ప్రక్రియను ముందే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. 48 గంటల వ్యవధిలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా యంత్రాంగం ఓటర్ల జాబితా సహా రిజరేషన్ల జాబితాను సిద్ధం చేసి ఉంచింది. పార్టీ పరంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయనుండటంతో తొలుత పార్టీ గుర్తుపై జరిగే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. తద్వారా పార్టీలోని అంతర్గత విభేదాలు తొలగి.. మెజార్టీ పంచాయతీలను కైవసం చేసుకోవచ్చని భావిస్తున్న అధికార పార్టీ ఆ దిశగా అడుగులు వేస్తోంది.

27న కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ సంబురాల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

కలెక్టర్ నారాయణరెడ్డి

తుక్కుగూడ: టీజీఓఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.రామారావు, కార్యదర్శి శ్రీనేశ్ కుమార్, నాయకులు శాంతిశ్రీ, మహేశ్వరి, పద్మావతి, అలివేలు, సైదమ్మ, వెంకటేశ్, లక్ష్మణస్వామి, రాకేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బరిలో తొమ్మిది మంది

- మదర్ డెయిరీ సభ్యుల నియామకానికి 27న ఎలక్షన్

హయత్‌నగర్: నల్లగొండ– రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమాఖ్య లిమిటెడ్(నార్ముల్ మదర్ డెయిరీ) పాలకవర్గ ఎన్నికల్లో తొమ్మిది మంది చివరి బరిలో నిలిచారు. డెయిరీలో ఖాళీగా ఉన్న ముగ్గురు సభ్యుల నియామకం కోసం దాఖలు చేసిన నామినేషన్ల ఉప సంహరణ, స్క్రూటినీ అనంతరం తొమ్మిది మంది తుది పోటీలో ఉన్నారు. మహిళా రిజర్వేషన్ స్థానానికిగానూ కర్నాటి జయశ్రీ, గుంట్ల రాధిక, మోతె పూలమ్మ, సుదగాని విజయ తలపడనున్నారు. మిగిలిన రెండు అన్‌రిజర్వ్ స్థానాల్లో కుంచాల ప్రవీణ్‌రెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహ్మారెడ్డి, శీలం వెంకటనర్సింహ్మారెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్ పోటీ పడుతున్నారని ఎన్నిల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్ లో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఒంటిగంట వరకు పోలింగ్ కొనసాగుతుందని స్పష్టంచేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాలు, విజేతల ప్రకటన ఉంటుందన్నారు. ఎన్నికయ్యే సభ్యులు అక్టోబర్ 1న బాధ్యతలు చేపడుతారని వెల్లడించారు. అర్హులైన సొసైటీల చైర్మన్లు ఐడీ కార్డుతో వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు.

న్యూస్‌రీల్

‘ఏఓఈఎఫ్’కు దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: విదేశీ వర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం(ఏఓఈఎఫ్) కింద 2025–26కు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి జె.రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు రూ.20లక్షల స్కాలర్‌షిప్ పొందేందుకు యూఎస్ఏ, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, జర్మనీ వర్సిటీల్లో మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులతో పాటు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చేయాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నవంబర్ 19 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ సృజనకు వినతిపత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

కేశంపేట: పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సంఘం, ఏఐటీయూసీ నాయకులతో కలిసి నగరంలోని పంచాయతీరాజ్ కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజనకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్యం, నాయకులు రామచంద్రయ్య, పద్మమ్మ తదితరులు ఉన్నారు.

‘ఎక్స్‌పీరియం పార్కు’ను ఎక్స్‌పీరియన్స్ చేయాలి

సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్



పార్కు బయటకు వస్తూ అభివాదం చేస్తున్న సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

శంకర్‌పల్లి: మండల పరిధిలోని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కుని ప్రతీ ఒక్కరూ ఎక్స్‌పీరియెన్స్ చేయాలని సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులతో కలిసి ఎక్స్‌పీరియం పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కు ఎండీ రాందేవ్ రావు ఇక్కడి వింతలు, విశేషాలు హీరోకి వివరించారు. ఏళ్ల క్రితం నాటి చెట్లు, మొక్కలు వాటి ప్రాముఖ్యతపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చేరువలో ఇంత పెద్ద పార్కు ఉండడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

తెలంగాణ జాగృతిలో పలువురి చేరిక



పాండు రంగారెడ్డికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు పలువురు.. తెలంగాణ జాగృతి పార్టీలో చేరారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అందుగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో.. బీఆర్ఎస్ బడంగ్‌పేట కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు వేద భవాని, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు ఎస్.గణేశ్ నాయక్, బాబురావు, శివరామకృష్ణారెడ్డిలు బుధవారం హైదరాబాద్‌లో జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సమక్షంలో జాగృతిలో చేరగా.. ఆమె వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు నవీన్‌చారి, అచ్చన, సేనాపతి, కోల శ్రీనివాస్, కంచర్ల శివారెడ్డి, సంపత్‌కుమార్, రవీందర్ ముదిరాజ్, భూషణ్‌గౌడ్, జంగయ్యగౌడ్, కిరణ్ కుమార్, యాదగిరి, శ్రీనివాస్, నవీన్‌గౌడ్, అమ్రీన్, సుల్తానియా, లావణ్య పాల్గొన్నారు.



ఆర్గానిక్ హెల్త్‌కిట్స్ పంపిణీ చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

‘ఐక్యత’తో ఉచిత ఆరోగ్య సేవలు

టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో ప్రతీ కుటుంబానికి ఉచిత ఆరోగ్య సేవలు అందజేస్తామని టాస్క్ సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పల్గుతండాలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్‌క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ శిబిరంలో 260 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రజలకు ఆర్గానిక్ హెల్త్‌కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుంకిరెడ్డి మాట్లాడుతూ.. ఐక్యత ఫౌండేషన్ విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఐక్యత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకరకొండ తండా మాజీ సర్పంచ్ నారాయణ, మాజీ ఉప సర్పంచ్ రవీందర్, నాయకులు రమేశ్‌నాయక్, గేమ్య, బిచ్యా, రాజు, హర్య, భాస్కర్, రఘు, సాయి తదితరులు పాల్గొన్నారు.

‘బతుకమ్మ’ ఏర్పాట్లను సమీక్షించిన సీఎస్

29న సరూర్‌నగర్ స్టేడియంలో ‘గిన్నిస్ రికార్డు బతుకమ్మ’

సాక్షి, సిటీబ్యూరో: అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ప్రారంభోత్సవం శుక్రవారం, సరూర్‌నగర్ స్టేడియంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కోసం బతుకమ్మ కార్యక్రమం సోమవారం జరగనున్నాయి. మొదటి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పాల్గొననుండగా రెండోదాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ రెండింటికీ సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. బతుకమ్మకుంట ప్రారంభోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరవనున్నారని, దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీతో పాటు హైడ్రా అధికారులను సీఎస్ ఆదేశించారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న గిన్నిస్ బుక్ రికార్డ్ బతుకమ్మ కార్యక్రమంలో దాదాపు 10 వేల మందికి పైగా మహిళలు బతుకమ్మలతో హాజరవుతారని ప్రధాన కార్యదర్శి అన్నారు. అక్కడా మౌలికవసతులతో పాటు స్టేజ్ ఏర్పాట్లు, విద్యుదీకరణ తదితరాలను చేపట్టాలని స్పష్టం చేశారు.

పాడి పరిశ్రమ స్థాపనతో లాభాలు

పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి



మహిళా రైతులతో కొండల్‌రెడ్డి, రత్నాకర్ తదితరులు

షాబాద్: మహిళలు, యువత పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుని లాభాలు ఆర్జించవచ్చునని పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో ‘జిల్లా శాస్త్రీయ పద్ధతుల డెయిరీసాగు, పాల ఉత్పత్తుల విలువల జోడింపు’ పై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకం, పాల పదార్థాల తయారీపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ (పీవీఎన్‌టీవీయూ) డాక్టర్ కిషన్‌కుమార్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా ఆధునిక డెయిరీ ఫారాల స్థాపనపై సూచనలు ఇచ్చారు. పశుపోషణ, షెడ్ నిర్మాణం, తక్కువ లాభాలు వంటి అంశాలపై వివరించారు. సేవాస్ఫూర్తి ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. డెయిరీ రంగంలో గ్రామీణ మహిళల సాధికారత అంశంపై పాడి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పథకాల వినియోగం, వ్యాపార నైపుణ్యాల సాధన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ప్రోత్సహించారు. మజ్జిగ, నెయ్యి, క్రీమ్ తయారీపై డెమో ఇచ్చారు. ప్రొఫెసర్ శశికుమార్, సాహిత్య రాణి, అసోసియేషన్ ప్రొఫెసర్ లైవ్‌స్టాక్, ప్రొడక్ట్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో కోవా, కలాకండ్, పనీర్ చన్నా, రసగుల్లా, రసమలై, బాసుంది, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్ మిల్క్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి స్రవంతి, పాడి రైతులు యాదయ్య, మాణిక్యం, రాములు, శ్రీనివాస్, రాజు, గౌరీశ్వర్, మహేశ్, పూర్ణచందర్, రమ్య, స్వరూప, యజ్ఞశ్రీ, పద్మ, తదితరులున్నారు.

అభివృద్ధి పనులు వేగిరం చేయండి

- రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి
- ఆరుట్ల, మంచాల పాఠశాలలను సందర్శించిన అధికారుల బృందం



మంచాల పాఠశాల అభివృద్ధి ప్రణాళిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

మంచాల: తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల(టీపీఎస్) అభివృద్ధి పనులను వేగిరం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, డైరెక్టర్ నవీన్ నికోలస్ అన్నారు. బుధవారం వారు మంచాల మండల పరిధిలోని ఆరుట్ల, మంచాల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక, జరుగుతున్న పనులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుట్లలో ప్రీ ప్రైమరీ పాఠశాల నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేస్తే అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు సులువుగా ఉంటుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని.. విద్యార్థుల సంఖ్య సైతం అదే విధంగా పెరిగిందన్నారు. డిజిటల్ తరగతులు, క్రీడా ప్రాంగణం, పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పనులు మరింత వేగిరం చేయాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధితోనే పిల్లల భవిష్యత్ మారుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అదనపు తరగతి గదులు, లైబ్రరీ, సరిపడా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని పేరెంట్స్ కమిటీ కోరింది. అనంతరం మంచాల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను మ్యాప్ ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుశీందర్‌రావు, విద్యా కమిషన్ సభ్యులు పద్మజాషా, జ్యోత్స్న, ఎంఈఓ రాందాస్, మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ప్రధానోపాధ్యాయులు గిరిధర్‌గౌడ్, నారాయణరెడ్డి, ఝాన్సీ, రుబియానా బేగం, మోహన్‌రెడ్డి, ఆయా పాఠశాలలకు చెందిన పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

14 సీఎం రాక?

ఈ నెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వసతులు, విద్యాశాఖ అధికారులతో సమావేశమై విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భాగంగానే పనులు వేగవంతగా చేపట్టాలని ఉన్నత స్థాయి అధికారులు సందర్శనార్థం వచ్చినట్లు సమాచారం. నవంబర్ 14న సీఎం వచ్చే అవకాశం ఉందని వినికిడి.

హెడ్ కానిస్టేబుల్‌కు ఉత్తమ సేవా పతకం



అవార్డు అందజేస్తున్న సీపీ అవినాష్ మహంతి

షాద్‌నగర్: అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌కు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తమ సేవా పతకం అందజేశారు. కేశంపేట ఠాణాలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంకేసీ రాములు పోలీస్ శాఖలో తన పరిధిలో ఉత్తమ సేవలందించారు. ఈ మేరకు బుధవారం సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తమ సేవా పతకంతో పాటు రూ.20వేల నగదు పురస్కారం అందజేశారు.

మరకత శివాలయంలో సినీనటుడి పూజలు



పృథ్వీరాజ్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మరకత శివాలయాన్ని బుధవారం సినీ నటుడు పృథ్వీరాజ్ దంపతులు దర్శించుకున్నారు. మరకత లింగానికి అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి పృథ్వీరాజ్ దంపతులను స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు ప్రమోద్, హన్మంత్, గోపాల్ పాల్గొన్నారు.

జీఎస్టీపై అపోహలు నమ్మొద్దు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



బైక్ షోరూంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కేఎస్.రత్నం

చేవెళ్ల: జీఎస్టీ తగ్గింపుపై ప్రతిపక్షాల దుష్ప్రచారాలను నమ్మొద్దని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి పర్యటించారు. దుకాణదారులకు జీఎస్టీ తగ్గింపుపై సందేహాలను నివృత్తి చేశారు. ఎలక్ట్రికల్ దుకాణం, కార్లు, బైక్ షోరూంలు, మెడికల్ షాపు తదితర వ్యాపారస్తులను కలిసి జీఎస్టీ తగ్గింపుతో ఎలాంటి ప్రయోజనాలున్నాయో అడిగి తెలుసుకున్నారు. పలువురు దుకాణాదారులు ముందుగానే స్టాక్ తెచ్చుకోవడంతో వ్యాపారులకు నష్టం వాటిల్లుతోందన్నారు. ముందుగా తెచ్చుకున్న వాటి జీఎస్టీ మళ్లీ వెళ్లినప్పుడు తగ్గించి చెల్లిస్తారని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం దేశంలోని ప్రజలకు, వ్యాపారులకు మేలు చేకూర్చేందుకే ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతీ ఒక్కరు పన్నులు చెల్లించే విధానంతో వ్యాపార నిర్వహణలో పారదర్శకత పెరిగిందన్నారు. ప్రభుత్వాల ఆదాయం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వాసుదేవ్‌కన్నా, వెంకట్‌రాంరెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు సత్యనారాయణ, మానిక్యరెడ్డి, జి.కృష్ణగౌడ్, నాయకులు కృష్ణమోహన్, ప్రవీణ్, కృష్ణ, నర్సింలు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ అలైన్‌మెంట్ మార్చండి

ఎంపీ మల్లు రవికి బాధిత రైతుల వినతి



ఎంపీ మల్లురవికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

కడ్తాల్: హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్ మార్చాలని బాధిత రైతులు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని బాధిత రైతులు కోరారు. బుధవారం వారు హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో కలిసి తమ గోడును వివరించారు. రైతులకు సమాచారం ఇవ్వకుండానే 765 కేవీ హైటెన్షన్ సోలార్ పవర్‌గ్రిడ్‌లైన్‌ను వేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అలైన్‌మెంట్ మార్చేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎంపీ మల్లు రవి కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు శివరామకృష్ణ, పెంటారెడ్డి, రాములు యాదవ్, గోరటి కృష్ణ, మధుసూదన్‌రెడ్డి, జంగయ్య, రాజేశ్, పర్వత్‌కుమార్, వెంకటేశ్, క్యామ వెంకటేశ్, అభిషేక్‌రెడ్డి, కరీం తదితరులు ఉన్నారు.

జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలి



మేనేజర్ జమీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

మొయినాబాద్: మున్సిపల్ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పుర కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురపాలిక సంఘం ఏర్పడి 9 నెలలు అవుతున్నా.. వేతనాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ చట్టం ప్రకారం వేతనాలు, యూనిఫాంలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో విధులు బహిష్కరించి, ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ జమీర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు మహేందర్, అశోక్, నగేష్‌గౌడ్, రత్నం, సుధాకర్, సురేష్, కృష్ణ, జగన్, నర్సింహ్మా, వెంకటేశ్, ప్రమీల ఉన్నారు.

ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం



గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

షాబాద్/షహాబాద్: ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ సంఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాం కాలనీలోని ఇందిరా సొసైటీలో మధుబన్ కాలనీకి చెందిన శేషు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ గోదాం నిర్వహిస్తున్నారు. ఉదయం 4 గంటల సమయంలో కర్మాగారంలో అగ్ని కీలలు ఎగిసి పడ్డాయి. గమనించిన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే అందులోని ప్లాస్టిక్ స్క్రాప్ పూర్తిగా కాలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, రూ.8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు అందనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పారు.

హత్యాయత్నం కేసులో భార్య, మరో ఇద్దరి అరెస్టు

మూసాపేట: భర్తపై హత్యాయత్నానికి యత్నించిన భార్య, ఆమె ప్రియుడు, మరో వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తనను చంపటానికి ప్రయత్నించిదంటూ భార్యపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు వారు తెల్పిన వివరాలు...కామారెడ్డికి చెందిన చంద్రకళకు, పక్క ఊరులో ఉండే దుర్గయ్యతో ఇంటర్మీడియట్‌లో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఐదేళ్ల క్రితం చంద్రకళ తల్లిదండ్రులు దేశబోయిన భూపాల్‌కు ఇచ్చి వివాహం చేశారు. సంవత్సరం న్నర దూరంగా ఉన్నప్పటికి తిరిగి దుర్గయ్య కలవటంతో పాత ప్రేమ చిగురించి అప్పుడప్పుడు కలుసుకుంటున్నారు. 11 ఏళ్ల కిందట భూపాల్, చంద్రకళ కూకట్‌పల్లిలోని సంగీత్‌నగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. భూపాల్ ప్లంబర్ పని చేస్తుండగా, చంద్రకళ ఇళ్లల్లో పనిమనిషిగా చేస్తుంది. ఈ క్రమంలో దుర్గయ్యతో బంధాన్ని వీడలేక కూకట్‌పల్లిలోని సంగీత్‌నగర్‌లో ఆమె ఇంటి సమీపంలోనే అద్దె ఇంట్లో ఉంచింది. తరచుగా కలుస్తుండేది. భర్తకు విషయం తెలియటంతో ఆమెను మందలించాడు. దీన్ని భరించలేని చంద్రకళ దుర్గయ్యకు విషయం చెప్పింది. మంగళవారం ఉదయం చంద్రకళ 7 గంటలకు పనికి వెళ్లగా, 7.10 గంటలకు దుర్గయ్య, అతని స్నేహితుడు భరత్‌రెడ్డిలు మొహానికి నల్లని మాస్కులు ధరించి ఇంట్లోకి ప్రవేశించారు. భూపాల్‌ను పడుకోబెట్టి చంపేందుకు యత్నించారు. గట్టిగా అరవటంతో పక్క ఇంట్లో ఉన్న వారు తలుపులు కొట్టడంతో వారు పారిపోయారు. భూపాల్ కూకట్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు చేయటంతో అతని భార్య చంద్రకళను, ప్రియుడు దుర్గయ్య, అతని స్నేహితుడు భరత్ రెడ్డిలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

హీరో నాగార్జున పరువు నష్టం కేసు వాయిదా

సిటీ కోర్టులు: తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ హీరో నాగార్జున, ప్రతివాది కొండా సురేఖ గైర్హాజరయ్యారు. దీంతో వారి తరుపున న్యాయవాదులు పిటిషన్లు దాఖలు చేశారు. అయితే గత విచారణలో నాగార్జున వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్న కోర్టు..కొండా సురేఖను క్రాస్‌ఎగ్జామినేషన్ వాయిదా వేసింది. ఈ విచారణకు ఆమె కోర్టుకు గైర్హాజరు కావడంతో విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేస్తున్నట్లు సూచించింది. ఇదిలా ఉండగా.. సినీ అగ్రహీరో నాగార్జున కుమారుడు నాగచైతన్య విడాకుల విషయంపై మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, ఆమె వ్యాఖ్యలతో తన కుటుంబానికి పరువు నష్టం కలిగిందని నాగార్జున నాంపల్లి కోర్టులో కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి అడ్డంకులు తొలగడంతో.. బుధవారం రోడ్డు విస్తరణ సాధన సమితి సభ్యులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నందున రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. గతంలో ఎన్‌హెచ్ 163 అభివృద్ధిని గత ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. ప్రస్తుతం అడ్డంకులు తొలిగి, పనులు ప్రారంభం అయ్యాయని, అవి పూర్తయితే జిల్లాకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పరిగి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పరిగి నుంచి కొడంగల్‌కు నాలుగు లైన్లు, జిల్లా కేంద్రానికి నాలుగు లైన్ల రోడ్డు పనులు జరుగుతున్నాయని వివరించారు.

గుడిసె లేని ఊరే లక్ష్యం

గుడిసెలు లేని ఊరు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.

అమ్మానాన్న దూరమైనా.. చదువులమ్మకు దగ్గరై..

- ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థి
- చిన్నాన్న చిన్నమ్మ సహకారంతో ముందుకు
- డాక్టర్ అయి.. ప్రజాసేవలో తరిస్తా: వంశి



వంశీని సన్మానించిన గ్రామస్తులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామానికి చెందిన వెన్నశెట్టి మంజుల, జంగయ్య దంపతులకు వంశీకృష్ణ, నందిని ఇద్దరు సంతానం. వీరిద్దరు మూడేళ్లలోపు ఉన్నప్పుడే కన్నవారు దూరం కాగా.. అన్నా, చెల్లెలు అనాథలుగా మిగిలారు. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఆ సమయంలో ఆ చిన్నారులను చిన్నాన్న బీమయ్య, చిన్నమ్మ యాదమ్మ దంపతులు అక్కున చేర్చుకున్నారు. ఆదర్శంగా తీర్చిదిద్దారు.

చేరదీసినందుకు.. ఉన్నతంగా..

వంశీకృష్ణ, నందినిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి వరకు చదివించారు. ఆ తరువాత ఇద్దరు గురుకుల పాఠశాలకు ఎంపికై ఉన్నత చదువులు పూర్తిచేశారు. వంశీకృష్ణ గౌలిదొడ్డి గురుకుల కళాశాలలో ఇంటర్‌లో 920 మార్కులు సాధించాడు. ఆపై నీట్ ప్రవేశ పరీక్ష రాసి 407 మార్కులతో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాడు. అన్నను ఆదర్శంగా తీసుకున్న చెల్లెలు నందిని.. షాద్‌నగర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ పూర్తిచేసి, నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

ఎవరినీ మరువను.. వంశి

తల్లిదండ్రులను కోల్పోయిన మమ్మల్ని చిన్నాన్న, చిన్నమ్మలు చేరదీసి కన్నబిడ్డలా చూసుకున్నారు. వారి కష్టాన్ని వృథా కానీయకుండా గుర్తింపు తెచ్చుకున్నాను. అండగా నిలిచిన వారిని మరువను. డాక్టర్‌ను అయి.. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తాను.

ఆర్థికంగా అండగా ఉంటా

వంశీకృష్ణ మెడికల్ సీటు సాధించగానే.. అండగా ఉంటామంటూ దాతలు ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యార్థిని శాలువాతో సత్కరించి, ఆర్థికంగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుడు కృష్ణ రూ.25 వేలు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు చందునాయక్ రూ.11 వేలు ఇచ్చారు. మరికొందరు తాము సైతం అంటున్నారు.



వంశీని అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బతుకు బాటను చూపించారు



అమ్మానాన్న పోవడంతో మా చిన్నాయన, చిన్నమ్మలు చేరదీసి చదివించారు. నాడు ఉపాధ్యాయులు శివాజీ, వెంకట్రావు మమ్మల్ని బాగా చూసుకున్నారు. పాఠాలు చెప్పడమే కాదు.. బతుకు బాటను చూపించారు. వారి స్ఫూర్తితోనే ఉన్నతంగా చదువుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా తపన. – నందిని

ఇంట్లోకి చొరబడి.. పుస్తెలతాడును అపహరించి



వివరాలు సేకరిస్తున్న సీఐ వీరబాబు, డీఐ సమరం రెడ్డి



బైక్‌పై పారిపోతున్న దుండగుల సీసీఫుటేజీ

బైక్‌పై ఉడాయించిన దుండగులు

శంకర్‌పల్లి: వంట గదిలో ఉన్న వృద్ధురాలి మెడలో నుంచి దుండగులు పుస్తెలతాడును అపహరించారు. ఈ సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కొండకల్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి(82), పద్మమ్మ(70) దంపతులు. వీరితో కుమారుడు, కోడలు ఉంటున్నారు. బుధవారం కుమారుడు, కోడలు బయటకు వెళ్లారు. మధ్యాహ్నం భర్తకు భోజనం పెట్టేందుకు ఆమె వంట గదిలోకి వెళ్లింది. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దొంగలు.. ఇంటి ముందు ఆగారు. ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడుని లాక్కొని.. వెంట వచ్చిన వ్యక్తితో బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ వీరబాబు, డీఐ సమరం రెడ్డి వివరాలు సేకరించారు. చుట్టూ పక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి, వెలిమల గ్రామం వైపు వెళ్లినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భక్తి భావంతో మానసిక ప్రశాంతత



సేవాలాల్ ఇరుముడి పూజా కార్యక్రమంలో భక్తులు

కడ్తాల్: ప్రతి ఒక్కరూ భక్తిమార్గం ఎంచుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధి మద్దెలకుంట తండాలో సంత్ సేవాలాల్ మహరాజ్ మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో ఇరుముడి పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ సత్యం, ధర్మం, సమానత్వం, భక్తి విలువలు బోధించారని, ఆయన చూపిన మార్గంలో యువత నడుచుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజశాంతికి దోహదపడతాయని తెలిపారు. ఇందులో మాజీ సర్పంచ్ కస్నానాయక్ పాల్గొన్నారు.

ఘనంగా సీఎం సతీమణి పుట్టినరోజు



కేక్‌కట్ చేస్తున్న రేవంత్ మిత్ర మండలి నాయకులు

మాడ్గుల: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీత పుట్టినరోజు వేడుకలు ఆమె స్వగ్రామం మాడ్గుల మండల కేంద్రంలో బుధవారం ఘనంగా జరిగాయి. రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్ ఆలీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, బాణసంచా కాల్చారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగయ్య, పాండు గౌడ్, భాస్కర్, కష్టయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో 'భారతి సిమెంట్' రారాజు



తాపీ మేస్త్రీలు, డీలర్లతో సంస్థ ప్రతినిధులు

అనంతగిరి: నిర్మాణ రంగంలో రారాజు భారతి సిమెంట్ అని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సామ్రాట్ అన్నారు. వికారాబాద్‌లోని ఓం సాయి ట్రేడర్స్ డీలర్ దుకాణంలో బుధవారం తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని చెప్పారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌కు రూ.20 అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.1 లక్ష ప్రమాద బీమా బాండ్లను 60 మంది తాపీ మేస్త్రీలకు అందజేశారు. అనంతరం డీలర్ కృష్ణ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ పనితీరు చాలా ఫాస్ట్‌గా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీరాంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెపై లైంగిక దాడి.. తండ్రికి జీవిత ఖైదు

జగద్గిరిగుట్ట: కుమార్తెపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించారు. పోలీసుల వివరాల ప్రకారం..జగద్గిరిగుట్ట అంజయ్యనగర్‌కు చెందిన అనిల్‌గౌడ్ తన కుమార్తెపై పలుమార్లు పాల్పడగా..బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత సంవత్సరం ఏప్రిల్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గ్రానైట్ పలకలు తలపై పడి కార్మికుడి మృతి

శంషాబాద్ రూరల్: క్రేన్ బెల్ట్ ఊడిపోవడంతో..గ్రానైట్ పలకలు తలపై పడి కార్మికుడు మృతి చెందాడు. పెద్దగోల్కొండలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చత్తీస్‌గఢ్ రాష్ట్రం సారంగఢ్ జిల్లా ఠాకుర్‌దియా వాసి సంతోష్‌దాస్ కొన్ని రోజుల కిందట వలస వచ్చి చిన్నగోల్కొండలో నివాసముంటున్నాడు. అతని బావ ధరమ్ మహంత్‌తో కలిసి భవన నిర్మాణం పనులకు వెళ్తున్నాడు. వీరిద్దరు కలిసి రవిచంద్రవర్మ అనే వ్యక్తి వద్ద పని చేస్తున్నారు. పెద్దగోల్కొండలో ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండగా.. మంగళవారం రాత్రి డీసీఎంలో గ్రానైట్ పలకల లోడు వచ్చింది. వీటిని దింపడానికి సంతోష్‌తో పాటు గురుదేవ్ మహేష్, అమర్‌సింగ్ కూడా వెళ్లారు. డీసీఎం నుంచి గ్రానైట్‌ను క్రేన్ సహాయంతో దించుతున్నారు. ఈ సమయంలో క్రేన్ బెల్ట్ తెగిపోవడంతో గ్రానైట్ పలకలు సంతోష్‌దాస్‌పై పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన క్రేన్: వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: బైక్‌ను వెనక నుంచి క్రేన్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మదన్‌పల్లి పాతతండాకు చెందిన చిట్టిబాబు(38), తన స్నేహితులు నేనావత్ శంకర్, పాత్లావత్ రాజుతో కలిసి బైక్‌పై పాల్మాకుల వైపు వెళ్తున్నారు. బెంగళూరు జాతీయ రహదారిపై పాల్మాకుల శివారులోకి రాగానే.. వెనుక నుంచి క్రేన్ వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. బైక్‌పై వెనుక కూర్చున్న చిట్టిబాబు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై మధ్యలో కూర్చున్న రాజుకు గాయాలవగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

- జిల్లా కార్యదర్శి మహిపాల్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల నిరసన

బంట్వారం: ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు బుధవారం బంట్వారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడారు. బొప్పునారంలో సర్వే నంబర్ 69లో దళితులకు కేటాయించిన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలన్నారు. భూస్వాముల అక్రమ పట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. మైనింగ్, బీడు భూములకు రైతుభరోసా నిలిపేయాలని సూచించారు. అనంతరం డీటీ మహేశ్‌కు వారు వినతి పత్రం అందజేశారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

డీఎల్‌పీఓ ప్రవీణ్‌కుమార్



డీఎల్‌పీఓను సన్మానిస్తున్న ఎంపీఓ తదితరులు

యాలాల: రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం యాలాల జీపీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యాచరణ తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌పీఓగా బాధ్యతలు చేపట్టాక ఆయన తొలిసారి మండలానికి రావడంతో ఎంపీఓ యాదయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి ఆనంద్‌రావు, సిబ్బంది సాయి, జగదీశ్వర్, జానీ తదితరులు ఉన్నారు.

మురుగుమయంగా కోఠి ఈఎన్‌టీ..!

ఆసుపత్రి ఆవరణలో పొంగిపొర్లుతున్న వైనం

- వారం రోజులుగా ఇదే దుస్థితి, ఇబ్బందుల్లో రోగులు
- పట్టించుకోని ఆసుపత్రి, జీహెచ్‌ఎంసీ అధికారులు





ఆసుపత్రిలో పొంగిపొర్లుతున్న మురుగునీరు

సుల్తాన్‌బజార్: కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి మురుగుమయంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మురుగునీరు చేరడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం 1000 మంది వరకు అవుట్ పేషెంట్ రోగులు వైద్య సేవలు పొందుతుంటారు. అయితే ఆసుపత్రిలోని క్యూలైన్ వద్ద, ఆసుపత్రి క్యాంటీన్ వద్ద మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటున్నది. ప్రభుత్వం పంపిణీ చేసే ఆహారం సైతం మురుగునీటిలోనే రోగులకు అందజేస్తుండడంతో దుర్వాసనతో రోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. వారం రోజులుగా ఆసుపత్రిలో మురుగునీరు ప్రవహిస్తుండడంతో ఆసుపత్రి ప్రాంగణం మొత్తం మూసీ నదిని తలపిస్తోంది.

రోగులకు తప్పని తిప్పలు...

కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో ఎటు చూసినా మురుగునీరు ప్రవహిస్తుండడంతో ఆసుపత్రికి వచ్చే ప్రజలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోగం నయం చేసుకునేందుకు వచ్చే రోగులు కొత్త వ్యాధులు సోకుతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. వైద్యులు సైతం దుర్వాసన భరించలేక మాస్కులు పెట్టుకుని చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం డీఎంఈ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆసుపత్రిని సందర్శించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని చెప్పినా ఆసుపత్రి, జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈఎన్‌టీ ఆసుపత్రిలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.